

వరద ప్రాంతాల్లో సిపిఎం బృందం పర్యటన

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని వరద ప్రభావిత లోతట్టు ప్రాంతాలైన కనకాయలంక, పెదలంక గ్రామాల్లో సిపిఎం బృందం శనివారం పర్యటించింది. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు మాట్లాడుతూ వరద బాధితులకు ప్రభుత్వం తరఫున నిత్యావసర సరుకులతోపాటు పాడి రైతులకు దాణా అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు బాతిరెడ్డి జార్జి, దేవ సుధాకర్, మానపవు సుబ్బారావు, గొల్ల ఏడుకొండల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పడవపై వెళ్తున్న సిపిఎం బృందం

అప్పుడు అర్హులు..
ఇప్పుడు అనర్హులు..!

వికలాంగత్వం నిరూపించుకుంటేనే పింఛన్

20 ఏళ్ల నుంచి పెన్షన్ తీసుకుంటున్నా వైకల్య శాతం తగ్గిందనే పేరిట పింఛన్ రద్దు

జిల్లాలో 1289 మంది వికలాంగుల పెన్షన్ నుంచి వృద్ధాప్య పెన్షన్‌కు మార్పు

617 మంది వికలాంగుల పెన్షన్లు ప్రశ్నార్థకం

ప్రజాశక్తి - భీమవరం

వికలాంగులపై కూటమి ప్రభుత్వం కక్షగట్టిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 20 ఏళ్ల నుంచి వికలాంగ పెన్షన్ పొందుతున్నప్పటికీ అనర్హులుగా గుర్తించి వికలాంగ శాతం తక్కువగా ఉందని సాకు చూపి తొలగిస్తోంది. మరోమారు వికలాంగత్వాన్ని నిరూపించుకోకపోతే రద్దు చేస్తామని బెదిరింపులకు పాల్పడుతోంది. ఈ నేపథ్యంలో వికలాంగులు వైద్యుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ అనేక ఇబ్బందులు పడుతున్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో అర్హులను అనర్హులుగా గుర్తించి వికలాంగుల పెన్షన్లు మంజూరు చేశారని కూటమి ప్రభుత్వం భావించి వికలాంగుల పెన్షన్ ఏరివేతకు చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా జిల్లాలో వికలాంగుల పెన్షన్ల వెరిఫికేషన్ జరుగుతుంది. కూటమి ప్రభుత్వం పింఛన్ల సొమ్ము పెంచినట్లే పెంచి, వర్గీకరణ పేరుతో వికలాంగుల పింఛన్లను తొలగిస్తోంది. వికలాంగులంతా మరోసారి వైద్యుల వద్దకు వెళ్లి సదరం ధ్రువీకరణ చేయించుకోవాలని షరతు పెట్టింది. వికలాంగత్వం ఎంతుందో వైద్యులతో ధ్రువీకరించి పర్సంటేజీతో సర్టిఫికెట్లు తీసుకురావాలని కొత్త నిబంధనను ప్రవేశపెట్టింది. దీంతో గత 20 ఏళ్లుగా పింఛను తీసుకుంటున్న వికలాంగులు ఒక్కసారిగా సదరం సర్టిఫికెట్ల కోసం సచివాలయాలు, ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. అయితే వికలాంగులకు వైకల్య శాతం తగ్గిందన్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. వైకల్య శాతం 40 కంటే తగ్గిందనే సాకుతో చాలామంది పింఛన్లను తొలగిస్తున్నారు. దీంతో వికలాంగులు లబోదిబోమంటున్నారు. ఏం చేయాలో తెలియక మళ్లీ సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

వికలాంగత్వం 40 శాతం కంటే తక్కువుంటే వృద్ధాప్య పింఛనుకు మార్పు..

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మంచానికి పరిమితమైన వారికి రూ.15 వేలు, వికలాంగులకు రూ.6 వేలు పెన్షన్ అందిస్తోంది. అయితే గత వైసిపి ప్రభుత్వ హయాంలో చాలామందికి అర్హత లేకపోయినా సైరదీతో పెన్షన్ పొందారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ ఏడాది జనవరి నుంచి పెన్షన్ల రీవెరిఫికేషన్ చేపట్టింది. జిల్లాలో సుమారు 27,582 మంది వికలాంగులు పెన్షన్లు పొందుతున్నారు. ఇప్పటి వరకు 15,596 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 13,690 మంది మాత్రమే అర్హులని తేల్చారు. మిగిలిన వారిలో 1289 మంది వృద్ధాప్య పెన్షన్ పొందేందుకు అర్హులుగా గుర్తించారు. తనిఖీకి హాజరుకాని మరో 386 మందికి నోటీసులు అందజేశారు. అనర్హులుగా గుర్తించిన 617 మందికి వైకల్యాన్ని నిరూపించుకునే అవకాశం కల్పించారు. జిల్లాలో 1510 ఆరోగ్య పెన్షన్లు పొందుతున్న వారు ఉన్నారు. ప్రత్యేకంగా నియమించిన వైద్యుల బృందం వీరిని ఇంటింటికీ వెళ్లి తనిఖీ చేసింది. వారిలో 586 మంది మాత్రమే అర్హులని తేల్చింది. మిగిలిన 944 మందిలో 603 మంది వికలాంగ, 341 మంది వృద్ధాప్య పెన్షన్లు పొందేందుకు అర్హులని తేల్చింది. గత 20 ఏళ్లగా ఇస్తున్న పింఛను ఇప్పుడు ఎందుకు నిలిపివేస్తున్నారని పలువురు వికలాంగులు ప్రశ్నిస్తున్నారు. అయితే వికలాంగత్వం 40 శాతం కంటే తక్కువున్నా 60 ఏళ్లు దాటిన వారికి వృద్ధాప్య పింఛను కింద రూ.4 వేలు ఇచ్చేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో కొంతమంది వికలాంగులు ఊరట చెందుతున్నారు.



వైద్యాధికారులు గతంలో ఇచ్చిన పత్రాలు చెల్లవట..!

2006లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.200 పింఛన్ తీసుకున్న వికలాంగులు అప్పుడు అర్హత సాధించి, ఇప్పుడు అర్హత లేదని చెప్పడం విడ్డూరంగా ఉంది. అప్పుడు, ఇప్పుడూ రెండుసార్లూ తనిఖీలు చేసింది వైద్యులే. ఇప్పుడు అంగవైకల్యం తగ్గిందని ధ్రువీకరిస్తున్న ఈ డాక్టర్లది తప్పా, లేకపోతే అప్పుడు అంగవైకల్యం తక్కువున్నా ఎక్కువగానే ఉన్నట్లు సర్టిఫికెట్లు ఇచ్చిన వైద్యులదా అనే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలావుంటే గత 20 ఏళ్ల నుంచి పింఛన్లు తీసుకుంటున్న వికలాంగులు ఇప్పుడు ఒక్కసారిగా అనర్హులు ఎలా అయ్యారని పలువురు ప్రశ్నిస్తున్నారు. వికలాంగులంతా సదరం సర్టిఫికెట్లు చేయించుకోవాలని ప్రభుత్వం ఆదేశాలివ్వడంతో వారంతా సర్టిఫికెట్ల కోసం వైద్యులను ఆశ్రయించారు. చాలాచోట్ల వైద్యులు వికలాంగుల పట్ల దురుసుగా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి.

ప్రతినెలా రూ.1.17 కోట్లు ఆదా

జిల్లావ్యాప్తంగా వివిధ రకాల పెన్షన్లు 2,29,695 లక్షలు ఉన్నాయి. ప్రతినెలా రూ.9774 కోట్లు లబ్ధిదారులకు అందిస్తున్నారు. అయితే వికలాంగుల పెన్షన్ రీవెరిఫికేషన్‌తో పెన్షన్ మార్పు, రద్దుతో ప్రభుత్వానికి ప్రతినెలా రూ.1.17 కోట్లు ఆదా కానుంది. జిల్లావ్యాప్తంగా పింఛన్ల తనిఖీలో ఇప్పటి వరకూ 2,850 మంది అనర్హులని తేలింది. వీరిలో 2238 మంది వికలాంగ, వృద్ధాప్య పింఛన్లకు అర్హులు. రద్దు, మార్పు చేసిన పింఛన్ల ద్వారా ప్రభుత్వం ప్రతినెలా రూ.1.17 కోట్లు మిగుల్చుకోనుంది.

గోదావరి తగ్గుముఖం
ఊపిరి పీల్చుకున్న లంక గ్రామాల ప్రజలు

ప్రజాశక్తి - ఆచంట

నాలుగు రోజులుగా పెరుగుతూ వచ్చిన వశిష్ట గోదావరి శనివారం కాస్త శాంతించింది. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ గోదావరి తగ్గుముఖం పట్టింది. ఆచంట మండలం కోడేరులో పుష్కర ఘాట్లో దాదాపు మూడు అడుగుల మేర వరద నీరు తగ్గింది. వరద తగ్గుముఖం పట్టడంతో మండలంలోని లంక గ్రామాల ప్రజలతోపాటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. తహశీల్దార్ జి.కనకరాజు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు వరద సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు. వల్లూరు పిహెచ్‌సి డాక్టర్ హైందవి ఆధ్వర్యంలో కోడేరు, పెదమల్లం పర్యాటక కేంద్రం, పెదమల్లం అనగారలంక, కోడేరు పల్లిపాలెం, భీమలాపురం కాపులపాలెం, అయోధ్యలంక, పుచ్చలంక, గ్రామాల్లో వైద్య సిబ్బంది మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో వరద ఇంకా ఉధృతంగానే ఉండటంతో లంక గ్రామాల మధ్య పడవ ప్రయాణాలకు అధికారులు అనుమతులు ఇవ్వలేదు. దీంతో లంకవాసులకు రాకపోకలు లేకుండాపోయాయి. లంక గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లో కూరగాయలు పండించిన రైతులను మాత్రం వరద తీవ్ర నష్టాల పాల్జేసింది. ముందస్తు చర్యల్లో భాగంగా కోడేరు పెదమల్లం, కరుగోరుమిల్లి, భీమలాపురం గ్రామాల్లోని ఇంజిన్ పడవలను అధికారులు అందుబాటులో ఉంచారు. ఎస్ఐ కె.వెంకటరమణ ఆధ్వర్యంలో పుష్కర ఘాట్లు వద్ద పోలీసు బందోబస్తు కొనసాగుతోంది. లంక గ్రామాల్లో పోలీసులు పహారా కాస్తున్నారు. ముంపు బారిన పడిన భీమలాపురంలోని ఏటిగట్టు దిగువన ప్రాంతానికి చెందిన కాపులపాలెం కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు. ఆదివారం సాయంత్రం నాటికి వరద మరింత తగ్గుముఖం పడుతుందని అధికారులు భావిస్తున్నారు. కరుగోరుమిల్లి పుష్కర రేవు ఇంకా నీటిలోనే మునిగి ఉంది.

ముంపులో లంక భూములు

గోదావరి ఉధృతికి ఆచంట మండలంలోని లంక భూములు నీట మునిగాయి. కరుగోరుమిల్లి, కోడేరు, భీమలాపురం పరిధిలోని ఏటిగట్టు దిగువన ఉన్న లంక భూములు ముంపులో చిక్కుకున్నాయి. సుమారు నాలుగు అడుగుల మేర వరద నీరు చేరడంతో వివిధ రకాల పంటలు నీట మునిగాయి. కోడేరు శివారు ఉత్తరపాలెం లంక భూముల్లో వంగ, బెండ సాగవుతున్నాయి. భీమలాపురం, కరుగోరుమిల్లి భూముల్లో బీర, కొబ్బరి, అరటి, కూరగాయ పంటలను రైతులు సాగు చేస్తున్నారు. అయోధ్యలంక, పుచ్చల్లంక, రాయిలంక ప్రాంతాల్లో వరద నీరు చేరిన భూముల్లో కూరగాయలు, తమలపాకు, మునగ వంటి పంటలను సాగు చేస్తున్నారు. పంట భూముల్లో వరద నీరు చేరడంతో ఆయా పంటలు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



భీమలాపురం వద్ద కొబ్బరి తోటలో వరద నీరు



కనకాయలంకలో పడవలపై రాకపోకలు

పెనుగొండ రూరల్: గోదావరి వరద శనివారం సాయంత్రానికి సిద్ధాంతం వద్ద సుమారు నాలుగు అడుగులు మేర తగ్గింది. సిద్ధాంతం మధ్యస్థ లంక భూములోకి నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నాలుగు రోజులుగా వరద ఉధృతి వల్ల చేపల వేట లేకుండా పోయిందని మత్స్యకారులు వాపోతున్నారు సిద్ధాంతం దొంగరావిపాలెంలో సుమారు 150 కుటుంబాల వరకు గోదావరిపై చేపల వేట ద్వారా జీవనోపాధి పొందుతున్నాయి. అధికారులు స్పందించి వరద సమయంలో తమను ఆదుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

యలమంచిలి: గోదావరి వరద శనివారం సాయంత్రం నాటికి కొంతమేర తగ్గుముఖం పట్టింది. ఆయా గ్రామాల్లోని ప్రజలకు కష్టాలు మాత్రం తప్పలేదు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలైన కనకాయలంక గ్రామానికి ప్రధాన రహదారి అయినటువంటి కాజ్‌వేపై ఇప్పటికీ సుమారు ఆరు నుంచి ఏడు అడుగుల ఎత్తు మేర వరద నీరు ప్రవహిస్తుండటంతో ఆ గ్రామస్తులు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. పెదలంక గ్రామంలోని వంతెన కూడా వరద నీటిలో చిక్కుకోవడంతో రాకపోకలు నిలిచాయి. అక్కడ కూడా పడవలపైనే జనం రాకపోకలు సాగిస్తున్నారు.

ఒక్క ఇల్లూ కట్టలేదు..
స్థలమూ ఇవ్వలేదు..!

'ప్రభుత్వం వచ్చి ఏడాది దాటిపోయింది. ఇప్పటి వరకూ ఒక్క ఇల్లు కట్టుకునేందుకూ మన ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి తీవ్ర ఒత్తిడి వస్తోంది. ఇంటి నిర్మాణాలు ప్రారంభించకపోతే తీవ్ర ఇబ్బందికర పరిస్థితి ఉంటుంది. వెంటనే తగు నిర్ణయం తీసుకోవాలి'.. ఇటీవల జరిగిన ఏలూరు జిల్లా డిఆర్‌సి సమావేశంలో ఎంఎల్‌ఎలు లేవనెత్తిన ప్రశ్న ఇది.



ఏడాది దాటిన కూటమి పాలన

ఇప్పటి వరకూ పేదలకు ఒక్క ఇల్లు, స్థలమూ మంజూరు కాని దుస్థితి

ఇళ్లు కట్టుకునేందుకు రెండు జిల్లాల్లో 38 వేల వరకూ కొత్త దరఖాస్తులు

ఏలూరు జిల్లాలో 30,800, పశ్చిమలో 7,612 దరఖాస్తులు

డిఆర్‌సి సమావేశంలోనూ ఎంఎల్‌ఎలు ఇదే విషయంపై గగ్గోలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎంఎల్‌ఎలతోపాటు స్థానిక ప్రజాప్రతినిధులను, అధికారులను సైతం ఇళ్ల నిర్మాణం కోసం జనం నిలదీస్తున్న పరిస్థితి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటిపోయింది. ఇప్పటి వరకూ సామాన్య ప్రజానీకం సొంతింటి కలకు సంబంధించి ఒక్క అడుగూ ముందుకు వేయని పరిస్థితి. దీంతో ఇంటి నిర్మాణానికి గృహనిర్మాణ శాఖ వద్ద వేలాది దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉండిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటి వరకూ ఏలూరు జిల్లాలో ఇంటి నిర్మాణం కోసం 30,800 దరఖాస్తులు వచ్చాయి. పశ్చిమగోదావరి జిల్లాలో 7,612 దరఖాస్తులు గృహనిర్మాణ శాఖకు చేరాయి. కొత్త ఇంటి నిర్మాణాలకు ప్రభుత్వం నుంచి అనుమతి లేకుండాపోయింది. దీంతో దరఖాస్తులన్నీ అలానే ఉండిపోయాయి. కొత్త ఇంటి నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.లక్షా 80 వేలు ఇస్తే తమ ప్రభుత్వం రూ.2.50 లక్షలు ఇస్తామని చెప్పడం తప్ప ఇళ్ల నిర్మాణానికి సంబంధించి మంజూరు ప్రక్రియ లేకుండాపోయింది. దీంతో ఎంతోమంది సామాన్య ప్రజానీకం ఇంటి నిర్మాణం కోసం పడిగాపులు పడుతున్న పరిస్థితి ఉంది. దరఖాస్తు చేసుకుని ఇంకా నిరీక్షించలేక అప్పులు తెచ్చి ఇంటి నిర్మాణం చేస్తున్నారు. వీరికి ప్రభుత్వం నుంచి సాయం అందుతుందో, లేదో తెలియని అయోమయ పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వం ఏలూరు జిల్లాలో లక్షా రెండు వేల ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించింది. గడిచిన ఐదేళ్లతోపాటు ఇప్పటి వరకూ జరిగిన ఇళ్ల నిర్మాణం 60 వేలు వరకూ ఉన్నాయి. ఇంకా 40 వేలకుపైగా ఇళ్ల నిర్మాణం జరగలేదు. పశ్చిమగోదావరి జిల్లాలో గత ప్రభుత్వంలో 73,792 ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించగా ఇప్పటి వరకూ 35,784 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా 38 వేల ఇళ్ల నిర్మాణం జరగలేదు. ప్రస్తుతం వీటికి సంబంధించిన పనులు మాత్రమే సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి రోజులు గడిచిపోతున్నా కొత్త దరఖాస్తులకు మాత్రం మోక్షం కలగడం లేదు. దీంతో కొత్త ఇంటిని నిర్మించుకోవాలన్న కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై ఎంఎల్‌ఎల్లోనూ అసహనం వ్యక్తమవుతోంది.

ఒక్క స్థలమూ ఇవ్వలేదు

గత వైసిపి ప్రభుత్వం జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి పట్టణాల్లో సెంటు, గ్రామాల్లో సెంటున్నర చొప్పున ఇంటి స్థలాలను పంపిణీ చేసింది. తాము అధికారంలోకి వస్తే పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున ఇంటిస్థలం ఇస్తామని ఎన్నికల్లో కూటమి నేతలు ప్రకటించడంతోపాటు మేనిఫెస్టోలోనూ పెట్టారు. అధికారంలోకొచ్చి 14 నెలలు గడిచినా ఇప్పటి వరకూ ఒక్క స్థలమూ ఇవ్వలేదు. ఇంటి స్థలాలకు సంబంధించి ఎన్ని దరఖాస్తులు వచ్చాయో లెక్కలు కూడా చెప్పడం లేదు. భూసేకరణ చేసి ఇంటిస్థలం ఇస్తామని చెబుతూ కాలక్షేపం చేస్తున్నారు. దీంతో ఇంటిస్థలం అనేది సామాన్యులకు దక్కుతుందా అనే అనుమానాలు నెలకొన్నాయి. ఇళ్ల నిర్మాణం, ఇంటి స్థలాలపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై జనాల్లో తీవ్రమైన చర్చ సాగుతోంది.

లండన్ డిప్యూటీ మేయర్ ఉదయ్‌కు సత్కారం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఒక జూనియర్ సభ్యునిగా ప్రయాణం మొదలై యునైటెడ్ కింగ్డమ్‌లో ఒక ప్రముఖ రాజకీయ నాయకునిగా ఉదయ్ ఎదగడం, ఆయన కఠోర శ్రమ, అంకితభావం, స్ఫూర్తిదాయకమైన దృక్పథానికి నిదర్శనమని పలువురు వక్తలు అన్నారు. లండన్‌లోని రాయల్ బరో ఆఫ్ కెన్సింగ్టన్ అండ్ చెల్సియాకు డిప్యూటీ మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన భీమవరం ప్రాంతానికి అరియన్ ఉదయ్ ఆరేటిని శనివారం కెజిఆర్‌ఎల్ కళాశాలలో భీమవరం ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కౌన్సిలర్ నుండి డిప్యూటీ మేయర్‌గా ఉన్నతస్థాయికి చేరుకోవడం ఒక చారిత్రాత్మక విజయమని, సెంట్రల్ లండన్‌లో ఈ ప్రతిష్టాత్మక పదవిని చేపట్టిన మొదటి భారతీయ సంతతి వ్యక్తిగా ఉదయ్ నిలిచారని అన్నారు. భవిష్యత్ ప్రయత్నాలన్నింటిలో మరింత విజయం సాధించాలని కోరుకుంటున్నామని ఆకాంక్షించారు. భారతదేశం, యుకెల మధ్య అంతర్జాతీయ సంబంధాలను బలోపేతం చేయడంలో కృషి చేయాలన్నారు. అనంతరం ఉదయ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో యిర్రింకి సూర్యారావు, మెంటే మనోహర్, గన్నాబత్తుల శ్రీనివాస్, ఆరేటి ప్రకాష్, వబిలిశెట్టి కనకరాజు, ఉద్దరాజు కాశీ విశ్వనాధరాజు, నడింపల్లి మహేష్, టివివి.ప్రసాద్, కెజిఆర్‌ఎల్ కళాశాల ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, లయన్స్ క్లబ్ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.




లండన్ మేయర్ ఉదయ్‌ను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - పెనుగొండ రూరల్

ప్రతి ఒక్కరూ పరిసరాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాలని మహిళా శిశు సంక్షేమ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి.సుజాతా రాణి అన్నారు. సిద్ధాంతంలోని పలు అంగన్వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలన్నారు. ప్లాస్టిక్ వాడడం వల్ల అనేక వ్యాధులకు గురవుతారన్నారు. కేంద్రాల్లో ప్రీ స్కూల్ కార్యక్రమాలను, రికార్డులను పరిశీలించారు. పిల్లలకు వండిన ఆహారాన్ని రుచి చూశారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ ఎ.కృష్ణకుమారి, సూపర్‌వైజర్ రూతు కుమారి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



సురేష్‌ను సత్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

ఒకే నోటిఫికేషన్‌లో 4 పోస్టులు సాధించిన సురేష్

ప్రజాశక్తి - భీమవరం

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలంటే కష్టంతో కూడుకున్న పని. ఉద్యోగావకాశాలు తక్కువగా ఉండడం, ఆపై పోటీ కూడా ఎక్కువగా ఉన్న పరిస్థితుల్లో ఎంతో కష్టపడి ఇష్టంగా చదివి ఒకే నోటిఫికేషన్‌లో నాలుగు పోస్టులు సాధించి ఔరా అన్పించాడు.. భీమవరం నరసయ్య అగ్రహారానికి చెందిన కోండ్రు సురేష్ (సూర్య). డిఎస్‌సి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చాడు. పిఇటిలో జిల్లాలో రెండో స్థానం, పీడీ విభాగంలో జోనల్ స్థాయిలో 12వ స్థానం, ఎస్ఎ (పిఇ) 41వ స్థానం, స్పోర్ట్స్ కోటాలో ఎస్‌జిటిగా ఎంపికై డబుల్ డబుల్ ధమాకా సాధించాడు. సురేష్ ప్రాథమిక, మాధ్యమిక విద్య ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే సాగింది. భీమవరం డిఎన్ఆర్ కళాశాలలో డిగ్రీ, బిపిఇడి చేశారు. మూడేళ్లుగా అవనిగడ్డలో డిఎస్‌సి కోచింగ్ తీసుకున్నారు. క్రీడల్లో జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులుగా పని చేసిన సురేష్

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు, విద్యార్థుల సమస్యలపై నిరంతరం పని చేస్తున్న ఎస్ఎఫ్ఐలో సురేష్ క్రియాశీలక పాత్ర పోషించారు. విద్యార్థి ఉద్యమంలో సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటం చేశారు. 2017 నుంచి 2022 వరకు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీలోనూ ఉన్నారు.

డిఎస్‌సిలో డబుల్ ధమాకాలు
సత్తా చాటిన పలువురు అభ్యర్థులు

సురేష్‌ను అభినందించిన ఉపాధ్యాయ ఎంఎల్‌సి గోపీమూర్తి

డిఎస్‌సి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన సురేష్‌ను ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి అభినందించారు. స్థానిక పిడిఎఫ్ కార్యాలయంలో సురేష్‌ను శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ విద్యను కష్టంగా కాకుండా ఇష్టంగా చదువుకుంటే సురేష్‌లా అత్యుత్తమ ఫలితాలు సాధించొచ్చన్నారు. ఒకేఒక్క నోటిఫికేషన్‌లో నాలుగు పోస్టులు సాధించడం అనేది గొప్ప విషయమన్నారు. నేటి యువత సురేష్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రసాద్, ఉపాధ్యాయులు భవాని ప్రసాద్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సురేష్‌ను యుటిఎఫ్ నేతలు స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో శనివారం సాయంత్రం ఘనంగా సత్కరించారు ఎంఎల్‌సి గోపీమూర్తితోపాటు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, జిల్లా గౌరవాధ్యక్షులు సిహెచ్.పట్టాభిరామయ్య సూర్యను సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి క్రాంతికుమార్, జిల్లా కార్యదర్శులు రామకృష్ణరాజు, కుమార్ బాబ్జి, సాయిరామ్, రాష్ట్ర కౌన్సిలర్ రామానుజరావు, జెవివి నాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఒకేసారి 4 ఉద్యోగాలు..
స్ఫూర్తిదాయకంగా నిలిచిన వెంకటకృష్ణ

కాళ్ల: ఒకేసారి నాలుగు ప్రభుత్వ కొలువులు సాధించి శభాష్ అన్పించుకున్నారు బూరాడ వెంకటకృష్ణ. కాళ్ల మండలం పెదఅమిరం గ్రామానికి చెందిన బూరాడ వెంకటకృష్ణ స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 8వ ర్యాంక్, జోన్-2 స్థాయి (3 జిల్లాలు కలిపి) ఉద్యోగాలైన టిజిటి మ్యాథ్స్‌లో ఆరో ర్యాంక్, పిజిటి మ్యాథ్స్‌లో 24వ ర్యాంక్, రాష్ట్రస్థాయి ప్రిన్సిపల్ పోస్ట్‌కు 56వ ర్యాంక్ సాధించి ఒకేసారి 4 ఉద్యోగాలకు అర్హత సాధించారు. వెంకటకృష్ణ భార్య వరలక్ష్మి కాళ్ల మండలం వేంపాడు ఎంపిపి స్కూల్‌లో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పని చేస్తున్నారు. ఈమె ఉత్తమ టీచర్ అవార్డులు పొందారు. తన భర్తను ప్రభుత్వ టీచర్‌గా చూడాలనే, ఆమె అడిగిన కోరిక మేరకు అతను ఈ విజయాలను సాధించారు.



గ్రామీణ విద్యార్థులను ఉన్నతస్థాయికి తీర్చిదిద్దడమే లక్ష్యం

బూరాడ వెంకటకృష్ణ, పెదఅమిరం

కార్పొరేట్ విద్యాసంస్థలైన నారాయణ, రవీంద్రభారతి సంస్థల్లో, ప్రిన్సిపల్, డీన్‌గా, ఎస్ఆర్ విద్యాసంస్థలో ఎజిఎంగా పని చేసిన అనుభవంతో ఇప్పుడు ప్రిన్సిపల్ పోస్ట్‌ను సమర్థవంతంగా నిర్వహించాను. గ్రామస్థాయిలో ఉన్న విద్యార్థులను ఉన్నత స్థితిలో ఉండేలా తీర్చిదిద్దడమే తన లక్ష్యం. అందుకే స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్‌కు ప్రిఫరెన్స్ ఇస్తున్నా.

గ్రూప్స్‌నకు వెళ్లడమే లక్ష్యం :వెలగల రమ్యశ్రీ

పెనుమంట్ర: డిఎస్‌సి ఫలితాల్లో మార్టేరుకు చెందిన వెలగల రమ్యశ్రీ మూడు విభాగాల్లో తన సత్తా చాటింది. టిజిటిలో రాష్ట్ర స్థాయి ర్యాంక్ (మార్కులు 85.43), స్కూల్ అసిస్టెంట్ కేటగిరిలో స్టేట్ 8వ ర్యాంక్ (మార్కులు 87.43), పిజిటి కేటగిరిలో 80.5 మార్కులతో జోన్-2లో నాలుగో ర్యాంక్ లభించింది. గత సంవత్సరం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ (ఇఎంఆర్ఎస్) పరీక్షల్లో పోస్ట్ సాధించినా వేరే రాష్ట్రంలో పని చేయాల్సి రావడంతో చేరలేదని రమ్యశ్రీ తెలిపారు. ప్రస్తుతం సాధించిన విజయం స్ఫూర్తితో గ్రూపు పరీక్షలు రాసి మరింత ఉన్నతస్థానానికి చేరాలనేది తన అభిలాషగా వివరించారు. రమ్యశ్రీని పలువురు ప్రముఖులు అభినందించారు.



చదువుల తల్లి వేణుమాధురి

తాడేపల్లిగూడెం: మెగా డిఎస్‌సి ఫలితాల్లో మూడు జిల్లాల పరిధి నెంబర్-2 జోన్‌లో తాడేపల్లిగూడేనికి చెందిన వి.వేణుమాధురి మూడు జిల్లాల్లో ఉన్న ఏకైక ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టుకు ఎంపికై తన సత్తా చాటింది. మూడు జిల్లాల్లో ఉన్న ఏకైక పోస్టుకు వేలాదిమంది పోటీపడగా వేణు మాధురి ఎంపికై చదువుల తల్లిగా నిరూపించుకుంది. వేణు మాధురి స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు కూడా జిల్లాలో 11వ ర్యాంకు, సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టుకు జిల్లాలో 17వ ర్యాంకు సాధించింది. వేణు మాధురి తండ్రి మోహన్‌రెడ్డి స్కూల్ అసిస్టెంట్‌గా, తల్లి శ్రీలక్ష్మి ప్రైమరీ స్పెషల్ స్కూల్ హెచ్ఎంగా పని చేస్తున్నారు. సోదరి అనుచందన కూడా నరసాపురం మున్సిపాల్టీలో ప్రభుత్వ టీచర్‌గా పని చేస్తుంది. ఈ సందర్భంగా వేణుమాధురికి తాడేపల్లిగూడెం డివైఇఒ రామాంజనేయులు, టీచర్స్ అభినందనలు తెలిపారు.



వి.వేణుమాధురి

డిఎస్‌సిలో సత్తా చాటిన జువ్వలపాలెం కుర్రోడు

తొలి ప్రయత్నంలోనే 4 కొలువులు

కాళ్ల: జువ్వలపాలెం గ్రామానికి చెందిన నడిమింటి రాము డిఎస్‌సి ఫలితాల్లో ఏకంగా నాలుగు కొలువులు సాధించి ఔరా అనిపించారు. నడిమింటి లక్ష్మి పెద్దకుమారుడు నడిమింటి రాము జువ్వలపాలెం హైస్కూల్లో పదో తరగతి పూర్తి చేసి, భీమవరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ పూర్తి చేశారు. తర్వాత ప్రభుత్వ డైట్ కళాశాలల్లో డీసెట్ పూర్తి చేశారు. ఒకవైపు చదువుకుంటూనే మరోవైపు కూలి పని చేస్తూ జీవనం సాగించారు. క్రీడల పట్ల ఎంతో ఆసక్తితో బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ డిగ్రీని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో చదివారు.



తొలి ప్రయత్నంలోనే సాధించా

నడిమింటి రాము, జువ్వలపాలెం

నేటి యువతకు ఆదర్శవంతంగా నిలవడంతోపాటు పట్టుదల, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం ఈ మూడు అంశాలుండాలి. ఈ అంశాలు ఉంటే ఎన్నో గొప్ప విజయాలు సాధించొచ్చు.

నవ ప్రపంచాన్ని నిర్మించేది యువతే

నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్ శంకర్ రెడ్డి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నవ ప్రపంచాన్ని సృష్టించే శక్తి యువత సొంతమని నిట్ రిజిస్ట్రార్ పి.దినేష్ శంకర్‌రెడ్డి తెలిపారు. ఫోర్డ్ అలుమినిస్ ఆధ్వర్యంలో నిట్, శశి ఇంజినీరింగ్ కళాశాల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న ఫోర్డ్ ఇన్నోవేట్ ఎ కెరీర్ అండ్ కార్పొరేట్ ఫెస్ట్ శనివారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా దినేష్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ విభిన్న ఆలోచనలు ప్రతి విద్యార్థి జీవితంలో భాగం కావాలన్నారు. అవి వారి వ్యక్తిత్వానికి మెరుగులు దిద్దేలా ఉండాలన్నారు. డీన్ స్టూడెంట్స్ కెరీర్ అలుమ్ని అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ వీరేశ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్ కోసం కలలు కనడం వాటిని సాకారం చేసుకునేందుకు కృషి చేయాలని వివరించారు. శశి ఇంజినీరింగ్ కళాశాల ఉపాధ్యక్షుడు నరేంద్ర కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పరిజ్ఞానానికే పరిమితం కాకుండా సాఫ్ట్ స్కిల్స్, కోడింగ్, సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టిసారించాలన్నారు. పలువురు మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లోని పలు ఇంజినీరింగ్ కళాశాలల నుంచి హాజరైన విద్యార్థుల ప్యానల్ డిస్కషన్, కోడథాన్, రోబోటిక్స్, జన్ ఎఐ, ఐఒటి, గేమ్స్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్‌లు ఎంతగానో ఆకట్టుకున్నాయి. శశి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన జి.దేవిశ్రీప్రసాద్, కె.వినయ్ కుమార్, జి.వంశీ, కె.రవికుమార్ కలిసి ఉష్ణోగ్రత సెల్లార్ ఆటోమేషన్ ఎనర్జీ సిస్టం ఆధారిత పోర్టబుల్ లిథియం అయాన్ బ్యాటరీ ప్రాజెక్టును నిర్వహించారు.

25న మహాధర్నాను విజయవంతం చేయాలి : ఎంఎల్‌సి

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్రంలో ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఈ నెల 25న విజయవాడలో తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో శనివారం సాయంత్రం మహా ధర్నాకు సంబంధించి పోస్టరును గోపీమూర్తి, ఫ్యాప్టో నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2003 డిఎస్‌సి ఆధారంగా ఒపిఎస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహాధర్నాకు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, యుటిఎఫ్ నేతలు, నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టంగుటూరి జీవితం ఆదర్శనీయం

ప్రజాశక్తి - పాలకొల్లు

ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. టంగుటూరి జయంతి సందర్భంగా శనివారం పాలకొల్లు గాంధీ బొమ్మల సెంటర్లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారత స్వాతంత్ర పోరాటంలో అగ్రశ్రేణి నేతల్లో ప్రకాశం పంతులు ఒకరిని చెప్పారు. ప్రకాశం బ్యారేజీ నిర్మాణం వల్ల పది లక్షల ఎకరాల్లో రైతులు పంట పండించుకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సమాఖ్య నేతలు సోమంచి శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, హరిహర నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం అందరికీ ఆదర్శనీయమని విశ్రాంత ఎంఇఒ వెలివెల శ్రీరామకృష్ణ తెలిపారు. శనివారం నెగ్గిపూడి శివారు వనంపల్లి ప్రయిమరీ స్కూల్ వేదికగా స్థానిక బ్రాహ్మణ సేవా మిత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో టంగుటూరి జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి మాట్లాడారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా మిత్ర ట్రస్ట్ ప్రెసిడెంట్ వెలివెల శ్రీరామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ ఎర్రమిల్లి ఓం సాయి, జాయింట్ సెక్రటరీ కవికొండల రామారావు, ట్రెజరర్ ఎ.సత్యనారాయణ పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : తెలుగువారి తెగువకు నిలువెత్తు నిదర్శనం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అని పలువురు వక్తలు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో శనివారం క్విట్ ఇండియా స్తూపం వద్ద టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని నిర్వహించారు. మాజీ కౌన్సిలర్లు ఎద్దు ఏసుపాదం, విజ్జురోతి రాఘవులు, అరసవల్లి సుబ్రహ్మణ్యం, కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. కార్యక్రమంలో రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు ఎస్‌కె.చాన్ భాషా, ఆర్.సూర్యనారాయణరాజు, కె.చంద్రరావు, భట్టిప్రోలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యాన వృద్ధులకు భోజనం

పెనుగొండ:మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచితంగా భోజనం పంపిణీ చేశారు. ప్రతి శనివారం జరుగుతున్న ఈ సేవా కార్యక్రమాన్ని పెనుగొండ ఆక్సిఫార్డ్ స్కూల్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. మానవత అధ్యక్షులు కొమ్ముల రామకృష్ణ సౌజన్యంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మానవత జిల్లా సభ్యులు కర్రి నరేంద్రరెడ్డి, బచ్చు నరసింహారావు తదితరులు పాల్గొని వృద్ధులకు ఆహారం అందజేశారు. సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా వృద్ధులను ఆదుకోవడం మానవత ప్రధాన లక్ష్యమన్నారు.

ముద్దాయిలు సత్‌ప్రవర్తన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - తణుకు

ముద్దాయిలు ప్రవర్తనలో మార్పు తెచ్చుకోవాలని, సమాజంలో గౌరవంగా జీవించాలని ఛైర్మన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. శనివారం తణుకు సబ్ జైల్‌ను సందర్శించి రిమాండ్‌లో ఉన్న ముద్దాయిలకు అందుతున్న భోజన వసతి, వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జడ్జి సత్యవతి మాట్లాడుతూ ఎవరైనా న్యాయవాదిని పెట్టుకునే స్తోమత లేకపోతే వారికి మండల న్యాయ సేవల కమిటీ తణుకు వారి ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరూ న్యాయవాదిని కలిగి ఉండాలని తెలిపారు. జడ్జి వెంట న్యాయవాదులు టి.సత్యనారాయణరాజు, అజయ్‌కుమార్, జైలు సూపరింటెండెంట్ జి.మోహనరావు పాల్గొన్నారు.

నరసాపురం:సెప్టెంబర్ 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, కక్షిదారులకు సమన్యాయం చేయడంలో పోలీస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) జి.గంగరాజు అన్నారు. శనివారం స్థానిక కోర్ట్ హాల్ వద్ద పోలీసు ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. రాజీ పడదగిన కేసులను ముందుగా గుర్తించి ఇరు పార్టీలకు నోటీసులు ఇచ్చి మధ్యవర్తిత్వం నిర్వహించడం వల్ల కొన్ని కేసులను రాజీ చేయవచ్చన్నారు. లోక్ అదాలత్ ప్రాముఖ్యతను కక్షిదారులకు వివరించాలన్నారు. కోర్టు సముదాయంలో ప్రతి రోజూ జరుగుతున్న మధ్యవర్తిత్వాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఆర్.వరలక్ష్మి, నరసాపురం టౌన్, రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు బి.యాదగిరి, జి.దుర్గాప్రసాద్, ఎక్సైజ్ ఎస్ఐ ఖాసిం పాల్గొన్నారు.

ఆయిల్ కంపెనీలో తనిఖీ

తాడేపల్లిగూడెం:స్థానిక జూబ్లీ రోడ్డులోని అడ్డా ఫార్మా జర్మన్ టెక్నాలజీ కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్స్‌ను మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. వివిధ రకాల దినుసుల నుండి తయారు చేసే ఆయిల్ క్వాలిటీని, పరిశుభ్రతను తనిఖీ చేశారు. అనంతరం సంస్థ ట్రేడ్ లైసెన్స్, షాప్ లైసెన్సులను పరిశీలించారు. ఆయన వెంట ఎంహెచ్‌ఒ ఎస్.రాజు, టౌన్ ప్లానింగ్ అధికారి వి.జగదీశ్వరరావు, ఇన్‌ఛార్జి రెవెన్యూ ఆఫీసర్ పి.అశోక్‌కుమార్ ఉన్నారు.

బదిలీ ఉద్యోగులకు సత్కారం

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం పంచాయతీ పరిధిలో వివిధ శాఖల్లో పనిచేసి ఇటీవలే బదిలీ అయిన సచివాలయ కార్యదర్శులకు, అధికారులకు శనివారం గణపవరం పంచాయతీ వద్ద ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఆర్.బేబీ శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలు పాటించి పంచాయతీ అభివృద్ధికి కృషి చేసిన అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి మూర అలంకారం, కూటమి నాయకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు

పేదల పట్ల సేవా భావంతో ఉండాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - నరసాపురం

పేదల పట్ల ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో ఉండాలని ఆర్‌డిఒ దాసి రాజు అన్నారు. శనివారం రుస్తుంబాదలోని లెప్రసీ కాలనీవాసుల సమక్షంలో దాసి రాజు వివాహ వార్షికోత్సవ వేడుకను ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి అందరికీ తినిపించారు. ఆత్మీయ విందును ఆర్‌డిఒ రాజు ఏర్పాటు చేసి స్వయంగా వడ్డించారు. వృద్ధులకు, మహిళలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడారు. తాను నర్సాపురం తహశీల్దార్‌గా ఈ కాలనీలోని వారందరికీ అంత్యోదయ రేషన్ కార్డులను మంజూరు చేసి 35 కేజీల బియ్యాన్ని అందజేశానని, అదేవిధంగా వీరి సంక్షేమ అభివృద్ధికి తనవంతు కృషి చేశానని అన్నారు. కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బందెల రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - ఉండి

సీజనల్ వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఉండి మండలం చెరుకువాడలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నాల్గో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వర్షాకాలం పరిశుభ్రత థీమ్‌లో ఆమె పాల్గొని పరిసరాలను పరిశుభ్రం చేశారు. మురుగు డ్రెయినేజీల్లో నిల్వ ఉన్న దోమలను నిర్మూలించడానికి క్రిమిసంహారక మందులతో కూడిన ఆయిల్ బాల్స్‌ను వేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వర్షాకాలంలో వ్యాప్తి చెందే సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించి చేతులను పరిశుభ్రంగా ఏ విధంగా కడుక్కోవాలని అని చేసి చూపించారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వర్షాకాలంలో దోమతెరలు వాడటం నీరు నిల్వ లేకుండా చూసుకోవడం వంటి తగు జాగ్రత్తల వల్ల డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధులు వ్యాప్తి చెందవని వారు తెలిపారు. చిన్నారులు వర్షాకాలంలో వ్యాప్తి చెందే వ్యాధులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సంబంధించిన చార్టులను ప్రదర్శించారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే జంక్ ఫుడ్ మానేయాలని ప్రతి ఒక్కరూ ఇంటి భోజనం, పాఠశాలలో అందించే భోజనం తినాలన్నారు. సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటామని విద్యార్థులతో ప్రమాణం చేయించారు. అనంతరం పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థులు డిక్షనరీ చదవలేకపోవడంతో పాఠశాలలోని విద్యాబోధనపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ తెలుగుతోపాటు ఆంగ్ల విద్యపై పట్టు సాధించాలనే ఉద్దేశంతో ఇంగ్లీష్ మీడియంను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. అలాంటి డిక్షనరీ చదవలేకపోతే ఎలాగని వారు ప్రశ్నించారు. సైన్స్ ల్యాబ్‌ను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కొండేపటి సాంబశివరావు, డిపిఒ ఎం.రామనాథరెడ్డి, డిఇఒ ఇ.నారాయణ, భీమవరం డివిజనల్ అభివృద్ధి అధికారి వై.దోసిరెడ్డి, తహశీల్దార్ కె.నాగార్జున, ఎంపిడిఒ శ్రీనివాస్, ఎస్ఎంసి ఛైర్మన్ దేవిరెడ్డి శ్యామల, వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, హెల్త్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను ఉపసంహరించుకోవాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం

ప్రజాశక్తి - భీమవరం

కేంద్రంలో మోడీ ప్రభుత్వం విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని 35 భాగాలుగా విభజించి ప్రయివేటు టెండర్లు పిలిచారని, వాటిని వెంటనే ఉపసంహరించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం డిమాండ్ చేశారు. స్థానిక మెంటేవారితోటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో జిల్లా స్థాయి శిక్షణ తరగతులు శనివారం రెండో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని 35 భాగాలుగా విడదీసి ప్రైవేట్ టెండర్ పిలిస్తే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడాన్ని తప్పుబట్టారు. ఇప్పటికే ఐదు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఉక్కు పరిశ్రమ ప్రైవేటు కాదని, తాము కాపాడుతామని చెప్పారని, అయితే నేడు నోరు మెదపకపోవడం దారుణమని అన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకుడు ధోరణి ఇలానే ఉండటం బాధాకరమన్నారు. కేంద్ర మంత్రిగా ఉన్న శ్రీనివాస్‌వర్మ పరిశ్రమ నడపడానికి ఎటువంటి చర్యలూ చేపట్టకపోగా, ప్రయివేటీకరణకు మొగ్గు చూపడం దారుణమన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ కాపాడే చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.వాసుదేవరావు, ఎం.వైకుంఠం, డి.త్రిమూర్తులు చెల్లబోయిన వెంకటేశ్వరరావు, ఇంజేటి శ్రీను, ధనికొండ శ్రీనివాసరావు, శేషపు అశ్రియ్య పాల్గొన్నారు.

రోగుల నుంచి డబ్బులు వసూలు చేయలేదు

వర్మ హాస్పిటల్ అధినేత డాక్టర్ పి ఆర్ కె వర్మ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అందిస్తున్న వైద్య సేవలకు ఏ ఒక్క రోగి నుంచీ ఒక రూపాయి కూడా డబ్బులు వసూలు చేయలేదని భీమవరం వర్మ హాస్పటల్ అధినేత డాక్టర్ పిఆర్‌కె.వర్మ అన్నారు. శనివారం హాస్పటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ నుంచి ఇద్దరు ప్యానెల్ డాక్టర్లు వచ్చి ఆసుపత్రిలో రోగులతో మాట్లాడారని, ఎవరి నుంచీ ఒక్క రూపాయి కూడా తమ ఆసుపత్రి వసూలు చేయలేదని ఆనాడే ప్యానల్ డాక్టర్లు నిర్ధారించారని తెలిపారు. అయితే ఈ నెల 21వ తేదీ సాయంత్రం ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ పథకాన్ని నిలుపుదల చేస్తున్నట్లు ప్రభుత్వం నుంచి సమాచారం వచ్చిందన్నారు. ఇద్దరు పేషెంట్లకు అందించిన వైద్య సేవల్లో రెండు కోడ్‌లు వాడామని తెలిపారు. కోడ్‌లు పెరగడం కారణంగా రూ.3000 చొప్పున ఇద్దరు పేషెంట్లకు రూ.6000 పైన విధించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పది రెట్లు చెల్లించాలి కాబట్టి రూ.60,000 డీడీ తీయాల్సి ఉందన్నారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం ప్యానల్ డాక్టర్స్ అప్రూవల్ మేరకే ఆరోగ్యశ్రీలో వైద్య సేవలందించాలని అలాగే చేస్తున్నామన్నారు. ఆస్పత్రిలో ఇప్పటివరకు డయాలసిస్ సేవలు అందుకుంటున్న 175 మందికి వైద్య సేవలను నిలిపివేయలేదని తెలిపారు. కొత్త పేషెంట్లకు మాత్రం ఆరోగ్యశ్రీ పథకంలో వైద్య సేవలు అందించడానికి అనుమతి లేదని, డయాలసిస్ రోగుల కోసం ఆసుపత్రిలో 20 మిషన్లు ఏర్పాటు చేశామని, ప్రతిరోజూ 60 నుండి 70 మంది రోగులకు డయాలసిస్ సేవలను ఆరోగ్యశ్రీ ద్వారా అందిస్తున్నామని తెలిపారు. ఆరోగ్యశ్రీ నిలుపుదల చేసినట్లు ఇంటిమేషన్ వచ్చినా కూడా 22వ తేదీన 45 మంది డయాలసిస్ రోగులకు వైద్య సేవలందించామని తెలిపారు.


రైతులకు చెక్కులు అందజేస్తున్న సొసైటీ ఛైర్మన్ శ్రీనివాస్

రైతులకు చెక్కుల అందజేత

పెనుమంట్ర:పొలమూరు సొసైటీలోని 424 మంది రైతులకు మూడు శాతం పావలా వడ్డీ కింద ప్రభుత్వం నుంచి 7 లక్షల 63 వేల 154 రూపాయలు నిధులు వచ్చాయని సొసైటీ ఛైర్మన్ కండిబోయిన శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక సొసైటీ ప్రాంగణంలో రైతులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు చీపురుపల్లి ఆంజనేయులు, పసుపులేటి నాగ ధనలక్ష్మి, నీటి సంఘ అధ్యక్షులు గుడాల వెంకటేశ్వరరావు, మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ సయ్యద్ అలీ జిన్నా, సొసైటీ కార్యదర్శి ప్రహరాజు, రామ చంద్రరావు పాల్గొన్నారు.

వివేకానందలో పండ్ల దినోత్సవం

తణుకు:వివేకానంద గ్లోబల్ స్కూల్ (సిబిఎస్‌సి) వద్ద శనివారం పండ్ల (ఫ్రూట్స్ డే సెలబ్రేషన్స్) దినోత్సవ వేడుక ఘనంగా నిర్వహించారు. పండ్ల ప్రాముఖ్యత తెలియజేయడం, ఆరోగ్యకరమైన జీవన శైలిపై అవగాహన కల్పించడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని పాఠశాల యాజమాన్యం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థుల తల్లులు కళాత్మక నైపుణ్యంతో వాటిని వివిధ ఆకారాల్లో చిత్రించి వాటిలో గెలుపొందిన వారికి సర్టిఫికెట్స్‌ను, బహుమతులను అందజేశారు. స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఆర్.రవీంధ్రనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరిస్తా

రాజ్యసభ సభ్యులు పాకా వెంకట సత్యనారాయణ హామీ

భీమవరం :రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించటానికి కృషి చేస్తానని రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ హామీ ఇచ్చారు. ఆయన పార్లమెంటరీ కమిటీ ఆహారం, ప్రజా పంపిణీ కమిటీ సభ్యులుగా నియమితులైన సందర్భంగా జిల్లా రేషన్ డీలర్ల అసోసియేషన్ నాయకులు శనివారం భీమవరంలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రేషన్ డీలర్లు సమస్యలను ఆయనకు వివరించారు. చాలీచాలని ఆదాయంతో జీవిస్తున్నామని, తమకు ఇచ్చే కమిషన్ పెంచాలని కోరారు. సమస్యలు విన్న ఎంపీ సానుకూలంగా స్పందించి పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఆయనను కలిసిన వారిలో జిల్లా రేషన్ డీలర్ల అసోసియేషన్ కోశాధికారి మద్ది సుబ్బయ్య, దొంగ కృష్ణసాయి, కుమార్‌రాజు, రవికుమార్, కె.ఎస్.చక్రవర్తి, ఎం,శ్రీరాములు, రామాంజనేయరాజు ఉన్నారు.

నరసాపురాన్ని జిల్లా కేంద్రం చేయాలి

విప్ నాయకర్‌కు నేతల వినతి

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురాన్ని జిల్లా కేంద్రం చేయాలని కోరుతూ ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్‌కు నరసాపురం మాజీ ఎంఎల్‌ఎ బండారు మాధవనాయుడుతోపాటు, ప్రజా సంఘాలు, వ్యాపార సంఘాలు, బార్, డాక్టర్ అసోసియేషన్ సభ్యులు శనివారం వినతిపత్రం అందజేశారు. ముందుగా రాయిపేట కార్యాలయం నుంచి కూటమి కుటుంబ సభ్యులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్‌ఎ బండారు మాధవనాయుడు, వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ బ్రిటీష్ హయాం నుంచి నరసాపురం సబ్ డివిజన్ కేంద్రంగా ఉంటూ వస్తోందన్నారు. నరసాపురంలో అన్ని శాఖల సబ్ డివిజన్ కార్యాలయాలూ ఉన్నాయని, వాటిని జిల్లా కార్యాలయాలుగా అప్ గ్రేడ్ చేయొచ్చని తెలిపారు. నరసాపురం పట్టణానికి జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో 3 నరసాపురానికి సమీప దూరంలో ఉన్నాయన్నారు. గత వైసిపి ప్రభుత్వ మాజీ ఎంఎల్‌ఎ ముదునూరి ప్రసాదరాజు వ్యక్తిగత స్వలాభం కోసం జిల్లా కేంద్రాన్ని భీమవరం తరలించారన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి జరగాలంటే జిల్లా కేంద్రం ఒక్కటే పరిష్కారమన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, జిల్లాల పున్ణ పరిశీలన కమిటీని కలిసి నరసాపురానికి జిల్లా కేంద్రం చేయాలని కోరదామన్నారు. ఈ కార్యక్రమంలో చినమిల్లి సత్యనారాయణ, కోటిపల్లి వెంకటేశ్వరరావు, కూనపురెడ్డి రంగారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బూసి విశ్వేశ్వరరావు, చిటికెల రామ్మోహనరావు, గాది వనవయ్యా, కిరాణా వర్తక సంఘం అధ్యక్షులు సిహెచ్.శ్రీనివాస్, పాల్గొన్నారు.

ప్రకాశం పంతులు జీవితం స్ఫూర్తిదాయకం

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం


ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్

ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితాన్ని, పోరాట పటిమను నేటి యువత స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. స్థానిక కలెక్టరేట్లో శనివారం ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత ప్రకాశం పంతులు చిత్రపటానికి కలెక్టర్ నాగరాణి, డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ప్రకాశం పంతులు దేశం కోసం, రాష్ట్రం కోసం సర్వస్వాన్ని త్యాగం చేసిన మహనీయుడన్నారు. భారతదేశ స్వాతంత్రం, ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు టంగుటూరి ప్రకాశం పంతులు చేసిన కృషి మరువలేనిదన్నారు. సైమన్ కమిషన్ వ్యతిరేక నిరసనల సమయంలో బ్రిటీష్ సైనికులకు తన గుండెను చూపించి కాల్చుకోమని తన నిర్భయతను ప్రదర్శించినందుకు ప్రకాశం పంతులుకు ఆంధ్ర కేసరిగా బిరుదు పొందారన్నారు. సమావేశంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు, వసతి గృహ వార్డెన్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు బోధనేతర పనులు ఆపండి : ఎంఎల్‌సి గోపీమూర్తి

ప్రజాశక్తి - ఆకివీడు

ఉపాధ్యాయులకు బోధనేతర పనులను వెంటనే తగ్గించాలని, విద్యార్థులకు అశాస్త్రీయ పరీక్షా విధానం ఎంతమాత్రం తగదని ఉపాధ్యాయ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మండలంలో విద్యాసంస్థల్లో తనను గెలిపించిన వారికి కృతజ్ఞతలు తెలుపుతూ పర్యటించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. వారి సమస్యలు తెలుసుకుని మాట్లాడారు. అనంతరం గోపీమూర్తి విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం తమకు రివర్స్ పిఆర్‌సి ఇవ్వడం ఎంతో బాధ కలిగించిందన్నారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే సమస్యను పరిష్కరిస్తానని, వెంటనే పిఆర్‌సి ప్రకటిస్తానని ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదన్నారు. ఉపాధ్యాయులు బోధనకు సమయం లేకపోవడంతో బోధనేతర అంశాలపై ఎక్కువ దృష్టి పెట్టాల్సి వస్తోందన్నారు. విద్యా కిట్ల పంపిణీ, యోగా డే, మెగా పేరెంట్ డే వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించడం ఒక ఎత్తు అయితే, వాటిని ఆన్‌లైన్ చేయడంతా మరింత పని భారమవుతుందన్నారు. విద్యార్థులకు తీసుకొచ్చిన నూతన పరీక్ష విధానం అశాస్త్రీయంగా ఉందన్నారు. పుస్తకాల్లో పరీక్ష రాయడం ఎంతమాత్రం సాధ్యం కాదన్నారు. పరీక్షలు పాత పద్ధతిలోనే నిర్వహించాలన్నారు. మూడు సంవత్సరాల క్రితం మంజూరు చేసిన సరెండర్ లీవ్ డబ్బులు ఇప్పటివర ఉపాధ్యాయులకు చెల్లించలేదన్నారు. ఉపాధ్యాయుల బకాయిలు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం పలు విద్యాసంస్థల్లో ఆయన పర్యటించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎం.పారనాయుడు, ముత్యాల వెంకటస్వామి, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ప్రజాసంఘాల నేతలు పి.అప్పారావు కె.తవిటినాయుడు, బొడ్డుపల్లి రాంబాబు, సందక సూరిబాబు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

గణపవరం : స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర సందర్భంగా శనివారం గణపవరం పంచాయతీ సిబ్బంది వర్షాకాలంలో తీసుకోవాల్సిన పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపిడిఒ పి.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి శనివారమూ పారిశుధ్య పరిశుభ్రతపై ప్రజలకు ప్రత్యేక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ర్యాలీలో గ్రామ సర్పంచి మూర అలంకారం, పంచాయతీ కార్యదర్శి డిఎస్ఆర్.ప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆచంట : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ చేతులను సబ్బుతో శుభ్రపర్చుకోవడం ద్వారా వ్యాధులు దరి చేరవని ఎంపిడిఒ బిఎస్ఎస్.కృష్ణమోహన్ తెలిపారు. స్వర్ణ ఆంధ్రా, స్వచ్ఛాంధ్రలో భాగంగా ఎంవిఆర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆహారం తినే ముందు అరచేతులు సబ్బుతో ఎలా శుభ్రం చేసుకోవాలో చూపించి అవగాహన కల్పించారు. హెచ్ఎం శ్రీనివాసరావు, కార్యదర్శి నాగబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : పరిసరాల పరిశుభ్రతతో పాటు పర్యావరణ రక్షణలో కూడా ప్రజలు పాల్గొనాలని మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర సందర్భంగా శనివారం పట్టణంలోని 31వ వార్డు మున్సిపల్ స్కూల్ నుండి ఎస్వీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఇంటి ముందు నీరు నిలువ లేకుండా చూసుకోవాలన్నారు. తహశీల్దార్ ఎం. సునీల్ కుమార్ మాట్లాడారు. రంగు విగ్రహాలు కాలువలో నిమజ్జనం చేయుట వలన నీరు కలుషితమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, మెప్మా, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మొగల్తూరు : మండలంలోని గ్రామాల్లో పంచాయతీ సచివాలయ సిబ్బంది స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రలో భాగంగా ప్రదర్శన చేశారు. మొగల్తూరులోని పంచాయతీ, సచివాలయ సిబ్బంది తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తూ గ్రామాల ప్రదర్శన చేసి అవగాహన కల్పించారు.

తాడేపల్లిగూడెం : విద్యార్థి దశ నుండే పరిశుభ్రత పాటించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఇ.స్వరాజ్యలక్ష్మి తెలిపారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం స్థానిక సుబ్బారావు పేట మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులకు వర్షాకాలంలో పాటించాల్సిన పరిశుభ్రత అంశంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఎక్సైజ్ సిఐ స్వరాజ్యలక్ష్మి మాట్లాడారు. ప్రధానో పాధ్యాయిని, ఎక్సైజ్ ఎస్ఐ ఆర్.దొరబాబు పాల్గొన్నారు.

పాలకొల్లు : దాసరి నారాయణరావు మహిళా డిగ్రీ కళాశాలలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా వృక్ష శాస్త్ర అధ్యాపకులు మణిమాల పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత గురించి విద్యార్థినులకు వివరించారు. వర్షాకాలంలో వచ్చే అంటూ రోగాల గురించి కళాశాల ప్రిన్సిపల్ శోభారాణి మాట్లాడారు. దోమల ద్వారా సంక్రమించే వ్యాధుల గురించి ఫిజికల్ డైరెక్టర్ రమేష్ తెలిపారు. అనంతరం కళాశాలలో పోస్టర్ ప్రజెంటేషన్, ఎస్సే రైటింగ్ పోటీలను నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ సహకారంతో కళాశాల ప్రాంగణంలో దోమల నిర్మూలన మందును పిచికారీ చేయించారు. పట్టణ పరిధిలోని జివిఎస్‌విఆర్ఎం మున్సిపల్ మోడల్ ప్రయిమరీ స్కూల్‌కు రాయపూడి కనక జ్యోతి సౌజన్యంతో ఆక్వా ఫెరల్ వాటర్ ప్యూరిఫైయర్ హెచ్ఎం.భవానీ ప్రసాద్‌కు అందజేశారు. హెచ్ఎం మాట్లాడారు.

చవితి వేడుకలకు ఆన్‌లైన్‌లో అనుమతి పొందాలి

గణపవరం:మండలంలోని 25 గ్రామాల్లో నిర్వహించే వినాయక చవితి వేడుకలకు ఆన్‌లైన్లో పర్మిషన్ పొందాలని తహశీల్దార్ వైకెవి.అప్పారావు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ భవనంలో జరిగిన మండలస్థాయి మహిళా పోలీసులకు, విఆర్‌ఒలకు, అధికారులకు చవితి వేడుకలకు సంబంధించి వివరాలపై జరిగిన అవగాహన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి ఎంపిడిఒ ఆర్.బేబిశ్రీలక్ష్మీ అధ్యక్షత వహించారు. అప్పారావు మాట్లాడుతూ వినాయక చవితి వేడుకల్లో డిజె సౌండు సిస్టం ఏర్పాటు చేయొద్దన్నారు. విగ్రహాలు మట్టివి ఏర్పాటు చేసి కాలుష్య నివారణకు సహకరించాలన్నారు. సమావేశంలో ఎస్ఐ ఎం.వరలక్ష్మి మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ పై విద్యార్థులకు అవగాహన

గణపవరం:గణపవరం డిగ్రీ కాలేజీలో శనివారం ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి అధ్యక్షత వహించి మాట్లాడుతూ విద్యార్థులు హెచ్ఐవి ఎయిడ్స్ గురించి తెలుసుకోవాలన్నారు. కాలేజీ వైస్ ప్రిన్సిపల్ కె.స్వరూపరాణి మాట్లాడుతూ ఎయిడ్స్ రోగులకు ప్రభుత్వం తీసుకుంటున్న ఉపశమన చర్యలను వివరించారు. గుడ్ లాంప్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.సుకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఎయిడ్స్‌పై ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలన్నారు. గుడ్ లాంప్ మేనేజర్ మూర్తి మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ పిఒ జి.వెంకటరమణ, జి.వెంకట్రావు, జివి శారదాదేవి, సిహెచ్ అనురాధ పాల్గొన్నారు.

క్షీరా రామలింగేశ్వర స్వామి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

పాలకొల్లు :పాలకొల్లులోని క్షీరా రామలింగేశ్వర స్వామిని శనివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు హైకోర్టు జడ్జిని సత్కరించి స్వామి వారి ఫొటో, తీర్థప్రసాదాలు అందజేశారు. పాలకొల్లు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి షేక్ జియావుద్దీన్, కోర్టు సూపరింటెండెంట్ శ్రీనివాస్, తహశీల్దార్ వై.దుర్గాకిషోర్ ఉన్నారు.

CHANGE OF NAME

I, KURAPATI DHARMASWAMY (Old name) Son of KURAPATI SHOBANADRI , R/o Door.No. 2-41/1, Opposite Vetarnity Hospital, Pedavegi, West Godavari District, PIN-534475, have changed my name KURAPATI DHARMA SWAMY to KURAPATI DHARMASOMALINGESWARA RAO (new name) same as intimated to The General Public

పేరు మార్పు/ సవరణ

నేను అద్దంకి రత్నకుమారి W/o A. తాతారావు, నివాసం : డోర్‌నెం. 23ఎ-4-9/1, భగత్‌నగర్ వీధి, పాలకొల్లు, పశ్చిమగోదావరి జిల్లా.
ప్రస్తుతం నా యొక్క ఆధార్‌కార్డులో నా పేరు **అద్దంకి రత్నకుమారి** అని తప్పుగా నమోదు కాబడినది. నా యొక్క ప్రస్తుత, అసలు పేరు **అద్దింటి రత్నకుమారి** W/o **అద్దింటి తాతారావు** (ADDINTI RATNA KUMARI, W/o ADDINTI TATA RAO) గా మార్పు చేయుట జరుగుతుంది. కావున నేటి నుండి నా పేరును **అద్దింటి రత్నకుమారి**గా పిలవబడును. ఆధార్‌లో మార్పుకొరకు

మహారాజశ్రీ 4వ ఎడిషనల్ సివిల్ కోర్టు, ఏలూరు, ఏలూరు జిల్లా.

ఓ.ఎస్.నెం.121/2025

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంచ్ మేనేజర్, వట్లూరు ...వాది

బిట్వీన్

1.జయమంగళ శ్రీ నాగదేవి (భర్త) వెంకట శ్రీనివాస్

2.జయమంగళ వెంకట శ్రీనివాస్, S/o.జయరాజు వడ్డీగూడెం, గ్రామం, పెదపాడు మండలం, ఏలూరు జిల్లా. ...ప్రతివాదులు

వాది దాఖలు చేసిన పబ్లికేషన్

పై నెంబరు గల దావాలో ప్రతివాదులు తెలియజేయునది ఏమనగా పై తెలిపిన కోర్టులో ది.**03-09-2025**వ తేదీన వాయిదా కలదు. ఉదయం 10.30 ని॥లకు స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి తమ ఆక్షేపణలు తెలియపర్చుకొనవచ్చును. లేనియెడల కోర్టు వారు పరోక్షంగా, తీర్మానం చేయగలరని తెలియజేయుచున్నాము.

కొండేటి శ్రీనివాసరావు, అడ్వకేట్,
స్థలం: ఏలూరు పానుగంటి వారి వీధి, ఏలూరు.
తేది.23-08-2025 సెల్: 9441276324

ప్రకటన

శ్రీ తాడేపల్లిగూడెం 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఒ.యస్.నెం.585/2022

బిట్వీన్ :
దాసిరెడ్డి లక్ష్మి కొండాలమ్మ ...వాది
మరియు
1.యెలిశెట్టి వెంకట మోహన్
2.బొడ్డు ఆశాజ్యోతి ...ప్రతివాద్లు

పై నెంబరు దావాలో మీలో రెండవ ప్రతివాది బొడ్డు ఆశాజ్యోతి, C/o.యెలిశెట్టి వెంకట మోహన్, వానపల్లిగూడెం, 1వ వార్డు, తాడేపల్లిగూడెం అను మీకు ఎన్నిపర్యాయములు దావా సమన్లు పంపించిననూ మీరు బుద్ధిపూర్వకముగా తీసుకొనక నిరాకరించుచున్నారు. కావున మీరు ది.11-09-2025 సం॥తేదీ ఉదయం గం.10-30 ని॥ల లగాయితూ శ్రీకోర్టు వారి ఎదుట హాజరయి మీ సంజాయిషీ స్వయముగా కాని ప్లీడరు గారి ద్వారా గాని తెలుపుకొనవలయును. అట్లు మీరు హాజరు కాని యెడల మీ పరోక్షమున తీర్మానము చేయుదురు.

పి.ఆంజనేయరాజు, అడ్వకేటు,
తాడేపల్లిగూడెం.
సెల్: 9848018256